

సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 534.90 అడుగుల వద్ద ఉంది. ఇది 177.8698 టీఎంసీలకు సమానంగా ఉంది.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.2300 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కోవిడ్ జీరో



గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. జిల్లాలో కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.

న్యూస్‌రీల్

కృష్ణారెడ్డి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే సుచరిత, కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు

గుంటూరురూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన 48వ డివిజన్ కార్పొరేటర్ తనుబుద్ధి కృష్ణారెడ్డి కుటుంబసభ్యులు సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరితతో కలిసి సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. కృష్ణారెడ్డి అకాల మృతి విషయాన్ని ఎమ్మెల్యే సుచరిత సీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని కృష్ణారెడ్డి కుటుంబానికి హామీ ఇచ్చారన్నారు. కృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పరమపదనాథుని అలంకారంలో నారసింహుడు



మంగళగిరి: నగరంలోని లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి పరమపదనాథుడు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకోగా ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా ఆత్మకూరుకు చెందిన మురికిపూడి మాధవ రావు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన లంకా కృష్ణమూర్తిలు వ్యవహరించారు.

1,10,687 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,27,477 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,10,687 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,378 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దంపతులు బంగారు బొట్టు, నత్తు, బులాకీని సోమవారం సమర్పించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావును ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి వెంట మేయర్ రాయన భాగ్య లక్ష్మి ఆలయానికి విచ్చేశారు. మంత్రి నాగేశ్వర రావు దంపతులు 18 గ్రాముల బంగారంతో తయారు చేయించిన బొట్టు, నత్తు, బులాకీలను చైర్మన్‌కు అందచేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, చైర్మన్ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను మంత్రికి అందజేశారు.

ఇంద్రకీలాద్రిపై చురుగ్గా ఉగాది ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది పర్వదినానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. వసంత నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి తొమ్మిది రోజులు నిర్వహించే విశేష పుష్పార్చనకు లక్ష్మీ గణపతి ప్రాంగణంలోని యాగశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. రాజగోపురం ఎదుట కళావేదికపై పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఆలయానికి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది రోజు అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు గుడి ప్రాంగణంలో పుష్పాలతో అలంకరించాలని ఆలయ సిబ్బందిని అధికారులు ఆదేశించారు. పండుగ రోజు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులను వెండి రథంపై ఊరేగించనున్నారు.

పౌష్టికం..ఆరోగ్యదాయకం

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ పంపిణీ

- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రక్తహీనతను నివారించి, బలవర్థకమైన పౌష్టికాహారంగా రాగిజావ
- ప్రతి మంగళ, గురు, శనివారాల్లో విద్యార్థులకు పంపిణీ
- పాఠశాలల్లోనే రాగిజావ తయారీకి ఏర్పాట్లు
- ప్రభుత్వ పాఠశాలలకు రాగి పిండి, బెల్లం సరఫరా
- జిల్లాలోని 1,094 పాఠశాలల్లో 1.19 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి



మహత్తర పోషక విలువలకు చిరునామా రాగి.. తృణధాన్యాల్లోకెల్లా రారాజుగా నిలిచిన రాగితో చేసిన వంటలు ఆరోగ్యప్రదాతలు అని చెప్పడంలో సందేహం లేదు.. విద్యార్థులకు అదనపు శక్తి, ఆరోగ్యం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో నేటినుంచి రాగిజావను ప్రభుత్వం అందించనుంది. ఇప్పటికే విద్యార్థుల మెనూపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ.. వారికి పౌష్టికాహారం ఇస్తున్న ప్రభుత్వం, అదనపు శక్తి అందేందుకు, తద్వారా చదువుపై మరింత ఏకాగ్రత నిలిపేందుకు ఇకనుంచి ఈ బలవర్థక పానియాన్ని అందించనుంది.

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్న ప్రభుత్వం అందులో ఎప్పటికప్పుడు మార్పులను చేస్తూ మరింత బలవర్థకమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేస్తోంది. ఇకపై పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ముందుగా ప్రతి మంగళ, గురు, శనివారాల్లో రాగి (మాల్ట్) జావ అందించనున్నారు. సాదా, సీదాగా కడుపు నింపే ఆహార పదార్థాలకు బదులుగా బలవర్థకమైన పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా విద్యార్థులను చురుకుదనం, ఉత్సాహంతో కలగలసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనం మెనూలో రాగిజావను చేర్చారు.

ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బలవర్థకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు వ్యక్తిగత శ్రద్ధతో మధ్యాహ్న భోజన మెనూను రూపొందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు వారంలో మూడు రోజులపాటు రాగి మాల్ట్ (జావ) ఇచ్చేందుకు స్వయంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్ మంగళవారం విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

అదనపు శక్తి..

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,094 పాఠశాలల్లో చదువుతున్న 1,19,922 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా రాగి జావ అందించనున్నారు. గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని 17 మండలాల పరిధిలోని పాఠశాలలకు రాగి పిండి, బెల్లం సరఫరా చేశారు. వారంలో మూడు రోజుల పాటు పాఠశాలల్లోనే ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణంలో రాగి జావ తయారు చేసి విద్యార్థులకు అందించాల్సి ఉంది. ఫోర్టిఫైడ్ బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు, ఆకుకూరలు, కూరగాయలతో కూడిన బలవర్థకమైన ఆహారాన్ని ప్రతి రోజూ తృప్తిగా ఆరగిస్తున్న విద్యార్థులకు అదనపు శక్తిని, ఉత్సాహాన్ని అందించేందుకు మహత్తరమైన పోషక విలువలు కలిగిన రాగ జావ సిద్ధమవుతోంది. బెల్లంతో కలిపి తయారు చేసే రాగిజావలో ఉన్న పోషక విలువలు శరీరానికి శక్తిని, ఉత్సాహాన్ని ఇవ్వడంతో పాటు రక్తహీనతను నివారిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం

- ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది
- హెచ్3 ఎన్2 వైరస్ కేసులను గుర్తించే పనిలో వైద్య సిబ్బంది
- గుంటూరు వైద్య కళాశాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- జ్వరాలపై అవగాహన, అప్రమత్తత అవసరం



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: కోవిడ్ కేసులు తగ్గుముఖం పడుతున్నాయని సంతోష పడుతున్న తరుణంలో నూతనంగా హెచ్3 ఎన్2 వైరస్ కేసులు కొద్దిరోజులుగా దేశ వ్యాప్తంగా నమోదవుతున్నాయి. ఈనేపథ్యంలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ పలు రాష్ట్రాలను అలెర్ట్ చేసింది. ముఖ్యంగా నూతన వైరస్ కేసులు నమోదవుతున్న రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని, వైరస్ సోకకుండా తగు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఏపీలో కేంద్ర నివేదిక ప్రకారం నూతన వైరస్ కేసులు నమోదు కాలేదు. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తుగా వైరస్ బారిన పడకుండా ప్రజలను కాపాడాలనే ఉద్దేశంతో వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈనెల 13 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించారు.

గుంటూరు వైద్య కళాశాలలో టెస్టులు..

రాష్ట్ర ప్రభుత్వం గతంలో కోవిడ్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను గుంటూరు వైద్య కళాశాలలోనే చేసేలా ప్రత్యేక వైద్య పరికరాలను వైద్య కళాశాలకు అందజేసింది. కోట్లాది రూపాయలతో నూతనంగా ల్యాబ్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తాజాగా హెచ్3ఎన్2 వైరస్ నిర్ధారణ పరీక్షలు సైతం గుంటూరు వైద్య కళాశాలలోనే చేసేలా సంబంధిత కిట్‌లను జిల్లాకు పంపించింది. ఒక్కో టెస్ట్ చేసేందుకు సుమారు రూ. 40వేలు ఖరీదు చేసే కిట్‌లను రాష్ట్ర ప్రభుత్వం గుంటూరుకు సరఫరా చేసింది.

6,36,465 ఇళ్ల సర్వే పూర్తి..

జిల్లాలో నూతన వైరస్ బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తూ ఇంటింటికి తిరిగి వివరాలు నమోదు చేస్తున్నారు. జ్వరం అనుమానిత లక్షణాలు ఉంటే తక్షణమే వారికి చికిత్స అందిస్తున్నారు. ముఖ్యంగా జ్వరం, దగ్గు, జలుబు తదితర లక్షణాలు ఉన్నవారికి వ్యాధి నియంత్రణ కోసం తక్షణమే మందులు అందిస్తున్నారు. జిల్లాలో 7,14,045 ఇళ్లు ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఆశ, ఏఎన్ఎంలతోపాటు, వార్డు వలంటీర్లు వారం రోజుల వ్యవధిలో 6,36,465 ఇళ్లు సర్వే చేశారు. సర్వేలో భాగంగా జ్వరం, ఇతర లక్షణాలతో 850 మంది బాధపడుతున్నట్లు గుర్తించి, వారికి తక్షణ వైద్య సహాయం అందించారు. ఇంటింటి సర్వేలో రాష్ట్రంలో గుంటూరు జిల్లా 90.48 శాతంతో ఐదో స్థానంలో ఉంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కొంతకాలంగా జ్వరం కేసులు జిల్లాలో నమోదవుతున్నాయి. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జ్వరాలపై కొంత అవగాహన కలిగిఉండాలి. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జ్వరాలపై సర్వే చేస్తున్నారు. ఏమాత్రం అనుమానం ఉన్నా తక్షణమే వారిని సంప్రదించి చికిత్స పొందాలి. నూతన వైరస్ వ్యాధి నిర్ధారణ కిట్‌లను సైతం ప్రభుత్వం గుంటూరుకు పంపించింది. వైరస్‌ల బారిన పడకుండా ప్రజలు మాస్కులు ధరించడం, తరచూ శానిటైజర్ వినియోగించడం, భౌతిక దూరం పాటించడం వంటివి చేయాలి

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ

నేడు ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు గుజ్జనగుండ్ల సెంటర్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెక్ డోనాల్డ్స్, డీ–మార్ట్, యాక్సిస్ బ్యాంకులో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాకు టెన్త్ ఆపై విద్యార్హతలు గల నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలని సూచించారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతలు, ఆధార్ జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో సాయంత్రం 4.00 వరకు జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు తమ ప్రతినిధి పి.మణిదీప్‌ను 8074607278 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

జిల్లాలో 1424 హెక్టార్లలో పంటనష్టం

- ఉపరితల ద్రోణితో జిల్లావ్యాప్తంగా వర్షాలు
- ఆందోళనలో రైతులు

కొరిటిపాడు(గుంటూరు): ఉపరితల ద్రోణితో గుంటూరు జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. జిల్లాలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో 1220 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 204 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటిలో మంగళగిరి మండలంలోని నూతక్కి, రామచంద్రాపురం, మంగళగిరి గ్రామాలలో 500 హెక్టార్లలో మొక్కజొన్న, తాడేపల్లిలో 110 హెక్టార్లలో మొక్కజొన్న, దుగ్గిరాలలో 500 హెక్టార్లలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. దుగ్గిరాలలో మరో 100 హెక్టార్లలో జొన్నపంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అలాగే మంగళగిరి మండలంలోని నూతక్కి, రామచంద్రాపురం, పెదవడ్లపూడి గ్రామాలు, తాడేపల్లి మండలంలోని చిర్రావూరు, ఇప్పటం, గుండెమెడ గ్రామాల్లో 196 హెక్టార్లలో అరటి పంట, మంగళగిరి మండలంలోని పెదవడ్లపూడి గ్రామంలో 8 హెక్టార్లలో కూరగాయల పంటలకు నష్టం జరిగినట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పారదర్శకంగా పంట నష్టం నమోదు...

పంట నష్టం నమోదు ప్రక్రియలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు సూచించారు. ఏఓలు, వీఏఏలతో సోమవారం ఆయన ఎన్యుమరేషన్‌పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు అండగా నిలవాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పొలాల్లోకి వెళ్లి పంట నష్టం వివరాలు నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వారి పరిధిలోని అన్ని గ్రామాలలో పర్యటించాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ లోపు పారదర్శకంగా ఎన్యుమరేషన్ పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు పంట నష్టం జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శించాలని ఆదేశించారు. అంతేకాకుండా గ్రామాల్లో దండోరా వేయించిన తర్వాతనే జాబితాను సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శించాలని సూచించారు. పంట నష్టం నమోదులో నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తుది జాబితాను ఏప్రిల్ 4వ తేదీన జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని ఆయన వివరించారు.

ప్రత్తిపాడులో 14.2 మి.మీ వర్షం

జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 14.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1.2 మి.మీ వర్షం పడింది. మార్చి మాసంలో సాధారణ వర్షపాతం 6.4 మి.మీ కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 32.9 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కాకుమాను మండలంలో 10 మి.మీ., వట్టిచెరుకూరు 8.6, తెనాలి 2.8, పొన్నూరు మండలంలో 2.4 మి.మీ చొప్పున వర్షం పడింది.

ప్రక్షాళన దిశగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం

- గత డీఎంహెచ్‌ఓను ప్రభుత్వానికి సరెండర్ చేసిన కలెక్టర్
- తాజాగా మరికొంత మంది సిబ్బందిపై చర్యలకు రంగం సిద్ధం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ పనితీరుపై పలు ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కార్యాలయ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించారు. స్పందన కార్యక్రమానికి పలుమార్లు గైర్హాజరవడం, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, సక్రమంగా నివేదికలు అందించకపోవడం, గత డీఎంహెచ్‌ఓపై అనేక ఆరోపణలు రావడంతో తక్షణమే ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పూర్తిస్థాయిలో దృష్టి సారించి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లా ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు వైఎస్సార్ అర్బన్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్నారు. శాఖలో అన్ని పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తూ వస్తున్నారు. ఈ సమయంలో కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వైద్య ఆరోగ్య శాఖకు చెడ్డపేరు వస్తుండటంపై జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పలు నిధులకు సంబంధించిన ఫైల్స్, రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన ఫైల్స్ మాయమైనట్లు ఆరోపణలు వచ్చాయి. కార్యాలయ ఉద్యోగులు సైతం వాటిని సకాలంలో వెతికి కలెక్టర్ కార్యాలయానికి పంపించలేదు. అంతేకాకుండా పలు ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా కోవిడ్ బిల్స్ ప్రభుత్వం విడుదల చేసి ఏడాది కావస్తున్నా వాటిని కార్యాలయ ఉద్యోగులు, అధికారులు కోవిడ్ కాలంలో పనిచేసిన వైద్యులు, వైద్య సిబ్బంది ఖాతాల్లో జమ చేయలేదు. దీనిపై పలు మార్లు కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు రావడంతో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలకు కలెక్టర్ రంగం సిద్ధం చేశారు. ముఖ్యంగా కోవిడ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులను సరెండర్ చేసేందుకు కలెక్టర్ రంగం సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు సంబంధిత ఫైళ్లను కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. కార్యాలయం పరిపాలన అధికారి, ఆఫీస్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌లపై చర్యలకు రంగం సిద్ధమైంది.

ముగిసిన సోషల్ ఆడిట్

కొరిటిపాడు(గుంటూరు): రబీ పంటల ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి సోషల్ ఆడిట్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. పంటల నమోదు జాబితాలను జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతుల పరిశీలనకు ఉంచారు. 155 అభ్యంతరాలు వచ్చాయి. వీటిని వీఏఏలు, ఏఓలు పరిష్కరించి తహసీల్దార్‌కు అప్‌లోడ్ చేశారు. అక్కడ పరిష్కరించిన తర్వాత తుది జాబితాను ఈ నెల 23వ తేదీన ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

నిర్లక్ష్యం వీడకుంటే కఠిన చర్యలు

స్పందనకు రాని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి వారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులు కొందరు హాజరుకాకపోవడం సరికాదని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆగ్రహించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని అత్యంత ముఖ్యమైన కార్యక్రమంగా చూస్తుందన్నారు. ఇప్పటికీ కొందరు జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి రాకుండా సిబ్బందిని పంపిస్తున్నారన్నారు. ఇక నుంచి అధికారుల స్థానంలో సిబ్బందిని పంపిస్తే అనుమతించవద్దని స్పష్టం చేశారు. ఇక నుంచి తీరు మరకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అనంతరం వచ్చిన 136 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

కలుషిత నీటితో ఇబ్బందులు..

సుమారు 3 సంవత్సరాల నుంచి మా ప్రాంతంలోని మంచినీరు కలుషితమై వస్తున్నాయి. ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసిన ఫలితం లేదు. దాదాపు గ్రామంలోని 10 వేల మందికి పైగా ఇవే తాగి రోగాల బారిన పడుతున్నాం. సమస్య పరిష్కారం చేయడం కష్టం.. మీరు ఇవే తాగాలని పంచాయతీ సిబ్బంది అంటున్నారు. న్యాయం చేయండి.

– లాం ప్రాంత వాసులు

కల్తీ నూనె.. ప్రాణాలతో చెలగాటం

పట్నంబజార్‌తోపాటు పలు ప్రాంతాల్లో కల్తీ నూనె వ్యాపారం జోరుగా సాగుతుంది. రోడ్డు పక్క వ్యాపారుల దగ్గర్నుంచి రెస్టారెంట్ల వరకు ఇదే నూనె వాడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధికారులు కనీసం అటువైపు కూడా చూడడంలేదు. దీనిపై చర్యలు తీసుకోండి.

– సముద్రాల కోటేశ్వరరావు, గుంటూరు

• స్పందనలో వృద్ధురాలి ఆందోళన

గుంటూరు వెస్ట్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమంలో ఓ వృద్ధురాలు హల్‌చల్ చేసింది. పెదపరిమికి చెందిన కావూరు అక్కమ్మకు ఆమె తల్లి నుంచి కొంత భూమి సమకూరింది. అయితే సదరు భూమిని తాడికొండ రెవెన్యూ అధికారులు తనకు కాకుండా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చివరకు గుంటూరు ఆర్డీవో ప్రభాకర్ రెడ్డికి కూడా ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయింది. ఆమెతో తెచ్చుకున్న ఎలుకల మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు నివారించారు.

చిరుధాన్యాలతో చక్కని ఆరోగ్యం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



పోషణ్ పక్వాడాలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఉద్యోగినులు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: చక్కని ఆరోగ్యం కోసం రోజువారీ ఆహారంలో చిరుధాన్యాల వినియోగం పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పోషణ్ అభయాన్‌లో భాగంగా పోషణ పక్వాడా పక్షోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏప్రిల్ 3 వరకు జరుగుతుందన్నారు. చిరుధాన్యాలు వినియోగం పెంచడం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. బాలబాలికలు, యువతులు, గర్భిణులు, రక్త హీనత ఉన్న వారు మిల్లెట్లను ఆహారంగా తీసుకోవడం ద్వారా చక్కని ఫలితాలు పొందే అవకాశముంటుందన్నారు. ఈ ఏడాదిని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అంతర్జాతీయ మిల్లెట్స్‌గా ప్రకటించిందన్నారు. దీనిపై అధికారులు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, జిల్లా అధికారులు పరిశీలించారు.

చిన్నారులు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్నారులు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జెడ్పీ క్యాంపు కార్యాలయంలో పోషణ్ పక్వాడా–2023 పక్షోత్సవాలను ఆమె ప్రారంభించారు. హెనీక్రిస్టినా మాట్లాడుతూ పక్షోత్సవాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఉద్యోగినులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట పరిధిలో సమస్యలకు పరిష్కారం

ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ

నగరంపాలెం(గుంటూరు): స్పందనకు వచ్చే ప్రజా సమస్యలకు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక- స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు అర్జీదారుల సమస్యలను ఆలకించారు. బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత పోలీస్ అధికారులతో జూమ్ ద్వారా ఏఎస్పీ మాట్లాడారు. బాధితుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్పందనకు వచ్చే ప్రతి అర్జీని కూలంకుషంగా విచారించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దక్షిణ డీఎస్పీ జెస్సీప్రశాంతి కూడా అర్జీలు స్వీకరించారు.



సమస్యను వింటున్న జిల్లా ఏఎస్పీ సుప్రజ, పక్కన దక్షిణ డీఎస్పీ జెస్సీప్రశాంతి

సంతకం ఫోర్జరీ

నా మేనకోడలుకు 2020లో అచ్చంపేట మండలం తాళ్లచెరువు వాసితో పెళ్లయింది. వివాహ ధ్రువీకరణ పత్రంలో నేను రెండో సాక్షిగా సంతకం చేశాను. అయితే సదరు వ్యక్తి సత్తెనపల్లిలో పనిచేసే ఓ మహిళతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ క్రమంలో భార్యను ఇంటి నుంచి పంపేశాడు. అనంతరం గుంటూరు కోర్టులో కేసు దాఖలు చేసి, భార్యకు కోర్టు నుంచి విడాకుల నోటీసు పంపించాడు. కోర్టు కాగితాలను నిశితంగా పరిశీలించగా, వివాహ సమయంలో సాక్షిగా చేసిన నా సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించాను. తప్పుడు సంతకంతో విడాకులు పొందేందుకు ప్రయత్నించిన అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా. – ఎం.ఏడుకొండలు, గుంటూరు టౌన్

చూపు పోయింది

కంటి శస్త్రచికిత్స కోసం 2021 ఆగస్టులో తెనాలిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాను. 29న శస్త్రచికిత్స చేసి 30న డిశ్చార్జ్ చేశారు. అయితే కంటి చూపు కనిపించకపోవడంతో జీజీహెచ్‌లో చూయించుకున్నాను. అక్కడ వైద్యులు పరీక్షించి, చూపుపోయిందని బదులిచ్చారు. దీంతో శస్త్రచికిత్స చేసిన ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులను సంప్రదించాను. నిర్వాహకులు నా పట్ల ఇష్టానుసారంగా మాట్లాడారు. కంటి చూపు పోయేందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

– ఎం.నాగేశ్వరరావు, పాతరెడ్డిపాలెం, చేబ్రోలు

చర్యలు చేపట్టాలి

గత రెండేళ్లుగా యూట్యూబ్‌లో సామాజిక అంశాలపై అభిప్రాయాలు సేకరిస్తున్నాను. ఈ క్రమంలో ఓ వ్యక్తి నా పట్ల దుర్భాషలాడుతున్నాడు. దీంతో అతనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాను. అతనిపై కేసు నమోదైంది. అయినప్పటికి అతని ప్రవర్తనలో మార్పురావడంలేదు. అతనితో పాటు సహకరిస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– ఓ మహిళ, అరండల్‌పేట

బ్యాంక్‌లో ఉద్యోగమని..

ఉద్యోగం నిమిత్తం ఓ కన్సల్టెన్సీని సంప్రదించా. బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.50 వేలు తీసుకున్నారు. నెలలు గడిచినా ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో డబ్బులు చెల్లించాలని పలుమార్లు అడిగినా సరైన సమాధానంలేదు. అదేమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారు. న్యాయం చేయండి.

– మీరాబీ, నల్లపాడు

కేవీలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తెనాలిఅర్బన్: తెనాలి చినరావూరులోని కేంద్రియ విద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీలో హిందీ, ఇంగ్లిషు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ, టీజీటీలో హిందీ, ఇంగ్లిషు, సంస్కృతం, సోషల్ సైన్స్, మ్యాథ్స్, పీఆర్పీ, స్టాఫ్ నర్సు, కోచ్ ఫర్ స్పోర్ట్స్, కౌన్సిలర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్‌లతో పాటు దరఖాస్తు, బయోడేటా ఫారాలు తీసుకురావాలని తెలిపారు. వివరాలకు https://tenali.kvs.ac.in లో సంప్రదించాలన్నారు.

ఐదుగురు గంజాయి నిందితుల అరెస్ట్

రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న తెనాలి డీఎస్పీ స్రవంతిరాయ్



మాట్లాడుతున్న ఏఎస్పీ మహేష్, సూపరింటెండెంట్ అన్నపూర్ణ, సీఐలు

చేబ్రోలు: వివిధ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను పొన్నూరు పోలీసులు అరెస్ట్ చేశారు. చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో తెనాలి డీఎస్పీ కె.స్రవంతిరాయ్ సోమవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. పొన్నూరు పట్టణానికి చెందిన నూనె గోపి, కొల్లి సురేష్, దావీద్ హరిబాబు, తెనాలి ప్రాంతానికి చెందిన కలవకొల్లు మాణిక్యరావు, పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన చుక్కా సుబ్బారావు వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని పొన్నూరు పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ స్రవంతిరాయ్ మాట్లాడుతూ పట్టణంలో గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి ఐదుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసిన నిందితులు పొన్నూరుకు తీసుకువచ్చారన్నారు. పొన్నూరు -గుంటూరు రోడ్డులోని కనకదుర్గమ్మ గుడి పక్క డొంకలోని చెట్ల పొదల వద్ద దాచిన గంజాయిని విక్రయించటానికి నిలబడగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న పొన్నూరు అర్బన్ సీఐ బాబీ, ఎస్ఐలు హసీం, రామబ్రహ్మం, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

నగరంపాలెం(గుంటూరు): గంజాయి విక్రయించే ముగ్గురు యువకులను ఎస్ఈబీ (సెబ్) గుంటూరు- 2, డీఎస్ఈఓ బృందం సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఎస్ఈబీ గుంటూరు- 2 స్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్ఈబీ జిల్లా ఏఎస్పీ డీఎస్ మహేష్ వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం ఉదయం చుట్టుగుంట – కేవీపీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో ఎస్ఈబీ గుంటూరు–2, డీఎస్ఈఓ బృందాలు వాహన తనిఖీలు నిర్వహించాయి. ఈ క్రమంలో బాపట్ల జిల్లా చీరాల టౌన్ జవహర్‌నగర్‌కు చెందిన మందపాటి వీరాంజనేయులు, గుంటూరు అశోక్‌నగర్ 4/5వ అడ్డరోడ్డుకు చెందిన బెజవాడ శ్రావణ్ కుమార్, విజయవాడ పెనమలూరు వాసి సోమరోతు సాయిఆదిత్యను అదుపులోకి తీసుకుని విచారించారు. గంజాయిని వైజాగ్ నుంచి గుంటూరుకు తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో వెల్లడైంది. వీరిలో వీరాంజనేయులు పదో తరగతి వరకు చదవగా, శ్రావణ్‌కుమార్, సాయిఆదిత్య డిగ్రీ వరకు చదివారు. వీరాంజనేయులుకు గంజాయి తాగే అలవాటు ఉండగా, సాయిఆదిత్య పాత నేరస్తుడని చెప్పారు. వీరి నుంచి రూ.35 వేలు ఖరీదు చేసే ఒక కిలో 100 గ్రాముల గంజాయి, మోటారుసైకిల్ సీజ్ చేశారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ, ఎస్ఈబీ గుంటూరు–2 సీఐ కె.కర్ణ, డీఎస్ఈఓ సీఐ టీపీ నారాయణస్వామి, ఎస్ఐ ఇ.కల్యాణ్‌చక్రవర్తి, హెచ్‌సీలు పీవీ పోతురాజు, ఎం.లక్ష్మారావు, కానిస్టేబుళ్లు ఎల్.కోటేశ్వరరావు, పి.రవీంద్రరెడ్డి, కె.నాగరాజు, కె.ప్రేమ్‌కుమార్, సీహెచ్ ఆంజనేయులు, వీసీహెచ్ ఆంజనేయులు, కె.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మానవ సేవే సర్వప్రాణుల సేవ

- కేఎల్‌యూలో మన భూమి మన బాధ్యత కార్యక్రమం
- ముఖ్యఅతిథిగా విచ్చేసిన త్రిదండి చిన్నజీయర్‌స్వామి



జ్యోతి ప్రజ్వలం చేస్తున్న త్రిదండి చిన్న జీయర్‌స్వామి

తాడేపల్లిరూరల్: మానవ సేవే సర్వప్రాణుల సేవ అని త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మన భూమి మన బాధ్యత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన రాకను పురస్కరించుకుని కేఎల్ ఈఎఫ్ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, కార్యదర్శి కోనేరు శివ కాంచనలత ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా జీయర్ స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పక్షులు, జంతువులు చెట్లను నరకడం లేదు కానీ మానవుడే చెట్లను నరికి తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్నాడన్నారు. భూమి తల్లి మనకు ఎంతో జీవాన్ని, వనరులను ప్రసాదిస్తే మనం స్వార్థంతో వనరులను కలుషితం చేసి మానవ మనుగడను ప్రమాదంలో పడవేస్తున్నామని హెచ్చరించారు. ప్రపంచంలో 300 సంవత్సరాల క్రితమే టెక్నాలజీ ఉందని, కానీ అప్పుడు జరగని ప్రకృతి విధ్వంసం గత కొద్ది సంవత్సరాల్లోనే జరిగిందన్నారు. ప్రకృతికి మనం మేలు చేస్తే మనకు మనం మేలు చేసుకున్నట్లే అని హితవు పలికారు. మీరు పరబ్రహ్మను, ఆత్మను చూశారా? అని ఒక విద్యార్థి ప్రశ్నించగా, సమాధానంగా ప్రకృతి రూపంలో నేను పరబ్రహ్మను చూస్తున్నానని సమాధానమిచ్చారు. విశ్వవిద్యాలయ చైర్మన్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ వికాస్ తరంగిణి అనేక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సామాజిక బాధ్యతను నేర్పుతోందన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం అకడమిక్ డైరెక్టర్ ఆచార్య కేవీఎస్ మురళీకృష్ణ, విశ్వవిద్యాలయ ప్రొ చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాధరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, వివిధ విభాగాల డీన్‌లు, అధిపతులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ఉన్నత చదువుల వైపు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి దశను అధిగమించి ఇంటర్మీడియెట్‌లోకి ప్రవేశించే విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువుల దిశగా ముందుకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు బి.పోతిరెడ్డి పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్లో సోమవారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎన్.చక్రనాగ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలుపుకుంటూ, విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. టెన్త్ తరువాత ఇంటర్‌లో చేరే విద్యార్థులు తమకు నచ్చిన ఎంపీసీ, బైపీసీ తదితర కోర్సులను ఎంపిక చేసుకుని, వాటిపై దృష్టి సారించేందుకు అవసరమైన నైతిక స్థైర్యాన్ని అందించామని వివరించారు. ఇంటర్ దశలో క్రమశిక్షణతో ఎంచుకున్న సబ్జెక్టులలో ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు కలిసి చదువుకున్న విద్యార్థులు తమ సహచరులను వీడుతున్నామనే బాధతో భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పారిశ్రామిక ఆర్థిక అక్షరాస్యతపై ప్రదర్శన



జిల్లాస్థాయి ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులతో ఆరాధ్యశర్మ, శివనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పారిశ్రామిక రంగంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో సోమవారం నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ)లో భాగంగా జిల్లా స్థాయి ప్రదర్శన నిర్వహించారు. డీఈవో పి.శైలజ పర్యవేక్షణలో జరిగిన ప్రదర్శనకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఎండీపీ జిల్లా మేనేజర్ బి.ఆరాధ్యశర్మ మాట్లాడుతూ విద్యార్థులకు పారిశ్రామిక విధానంపై అవగాహన కల్పించేందుకు గత ఏడాది 14 నుంచి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా 85 పాఠశాలల నుంచి 317 ప్రాజెక్టులను ఏర్పాటు చేయగా, వాటిలో జిల్లా స్థాయికి 10 ప్రాజెక్టులు ఎంపికైనట్లు తెలిపారు. వీటిలో రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామని తెలిపారు. మంగళగిరి మండలం చినకాకాని జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు డి.సుజాత, స్వర్ణ రాజలతతో పాటు విద్యార్థులు వి.ధనుష్, దివ్య, సాత్విక, తెనాలి మండలం కొలకలూరులోని జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం.అన్నారావు, విద్యార్థులు వి.ఝాన్సీ, ఎస్.కావ్య, ఎన్.స్వాతి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో గుంటూరు డిప్యూటీ డీఈవో కె.సుధాకర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ఆర్.శివనాగేశ్వరరావు, డైట్ ప్రిన్సిపాల్ సుభాని, ప్రోగ్రామ్ మేనేజర్ సీహెచ్ బ్రహ్మం, పాఠశాల హెచ్‌ఎం ఆనందకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో ఢిల్లీలో ఆందోళనలు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నెహ్రూనగర్(గుంటూరు): జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని, చట్ట సభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లను పెంచాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల 28, 29వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలియజేశారు. సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల కులగణన చేపడతామని మాట ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం హామీని విస్మరించిందన్నారు. తొమ్మిదేళ్లుగా బీసీల సంక్షేమం కోసం కేంద్రం చేసింది శూన్యమన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. సంఘ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ఇటీవల ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశంలో బీసీల కులగణన చేస్తామని, చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పిస్తామని తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో సంఘ నాయకులు నిమ్మల శేషయ్య, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కొల్లికొండ వెంకటసుబ్రహ్మణ్యం, ముప్పాన వెంకటేశ్వర్లు, ద్వారకా శ్రీను, వెంకట్రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.